జిల్లాకు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్

పరిశ్రమ

- నాయుడుపేట వద్ద రూ. 3718 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తి
- 116 ఎకరాల కేటాయింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. తాజాగా నాయుడుపేట వద్ద రూ.3718 కోట్ల భారీ పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. దీనికి నాయుడుపేట వద్ద 116 ఎకరాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారిశ్రామిక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంత వేగవంతంగా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు ఈ పరిశ్రమే ఓ ఉదాహరణ. రబ్బర్ బ్లాక్స్, వాల్యూ యాడెడ్ కెమికల్స్ తయారీకి పేరుపడిన ఈ పరిశ్రమ.. నాయుడుపేట వద్ద ప్లాంట్ ఏర్పాటుపై తమ ఆసక్తి చూపింది. ఈ మేరకు 116.62 ఎకరాలను చదరపు మీటరుకు రూ.1948 ధరతో కేటాయించాలని సెప్టెంబరు 20న ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకుంది. రూ.3718 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, తద్వారా 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలియజేసింది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఆ ఫైలు ఆయా విభాగాల నడుమ పరుగులు తీసింది. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ సమావేశమై అదే ధరతో భూమిని కేటాయించాలని సిఫారసు చేసింది. 19వ తేదీన బోర్డు ఆమోదించింది. ఈ సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నాయుడుపేట సెజ్‌ను డీనోటిఫై చేసి 116.62 ఎకరాల భూమిని ఫిలిప్స్ పరిశ్రమకు కేటాయించాలని ఏపీఐఐసీని ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని సదుపాయాలనూ త్వరగా కల్పించి త్వరగా పరిశ్రమల ఏర్పాటయ్యేలా చూడాలని వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది.



భారీ వానల హెచ్చరిక

- అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్
- కంట్రోల్ రూం నెంబరు 0877-2236007

కంట్రోల్ రూమ్ నెంబర్లు

కలెక్టరేట్ : 0877-2236007

గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం: 08624-25807

సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం: 08623-295345

తిరుపతి ఆర్డీవో కార్యాలయం: 7032157040

శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం: 8555003504


తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా జిల్లాలో గురువారం వరకు భారీ వర్షాలు కురవనున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎటువంటి ఆస్తి.. ప్రాణనష్టాలు జరగకుండా యంత్రాంగం చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. కోస్తా తీర ప్రాంతాల్లో మత్స్యకారులను అప్రమత్తం చేసి సముద్రంలోకి వేటకు వెళ్లకుండా పర్యవేక్షించాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఏదైనా సహాయం, సమాచారం కోసం ప్రజలు ఆయా కంట్రోల్ రూములకు ఫోను చేయాలన్నారు.

తీరంలో ఎగిసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వాకాడు మండలం తూపిలిపాళెం తీరంలో సముద్ర కెరటాలు ఎగిసిపడుతున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అలలు ఒడ్డుకు వస్తున్నాయి. ఈదురుగాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. ఉదయం నుంచి తేలికపాటి వర్షంతోపాటు మంచుతోడుకావడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తమవుతున్నారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

నేడు సీఎం చంద్రబాబు రాక




తిరుపతి(నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెకు బుధవారం సాయంత్రం 6.20 గంటలకు సీఎం చంద్రబాబు రానున్నారు. గురువారం జరిగే తన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడి వైకుంఠ సమారాధన కార్యక్రమంలో పాల్గొననున్నారు. అలాగే, మంత్రి నారా లోకేశ్ కూడా సాయంత్రం స్వగ్రామానికి రానున్నారు. ఇక, మంగళవారం మధ్యాహ్నం సీఎం సతీమణి నారా భువనేశ్వరి హైదరాబాదు నుంచి నారావారిపల్లెకు చేరుకున్నారు. నారావారిపల్లెలో గురువారం జరిగే కార్యక్రమానికి పలువురు మంత్రులు, డిప్యూటీ స్పీకరు, నేతలు, శ్రేణులు రానున్నారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

తిరుపతిలో 'సిట్' కార్యాలయం సిద్ధం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సీబీఐ సిట్ కార్యాలయం సిద్ధమైంది. టీటీడీ పరిధిలోని భూదేవి కాంప్లెక్సులో ఉన్న ఎస్వీబీసీ పాత కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులోకి ఎవరినీ అనుమతించడంలేదు. గుర్తింపు కార్డులున్న టీటీడీ సిబ్బందినే అనుమతిస్తున్నారు. సిట్ కార్యాలయంలో సోమవారం ప్రాథమికంగాను.. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో అధికారిక కార్యకలాపాలను చేపట్టారు. గ్రౌండు ఫ్లోర్‌లో వీడియో కాన్ఫరెన్సు హాలు, మొదటి అంతస్తులో విచారణ, కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఏఆర్, వైష్ణవి డెయిరీలకు సంబంధించి ఫైళ్లు, టీటీడీకి, డెయిరీల మధ్య కుదిరిన ఒప్పందాల రికార్డులను ఇక్కడ పరిశీలిస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ జరుగుతున్న పరిణామాలు, విచారణ నివేదికలను వీడియో కాన్ఫరెన్సు ద్వారా సీబీఐ అధికారులకు వివరిస్తున్నారు. సిట్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వు బలగాలు మోహరించాయి. అదనపు ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో విచారణ ప్రారంభించారు. ప్రస్తుతం నలుగురు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, మరికొందరు పోలీసు బృందాలు కలసి టీమ్‌లుగా విడిపోయి విచారిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు డెయిరీలకు సంబంధించిన దాదాపు 25 నుంచి 40 ఫైళ్లు స్వాధీనం చేసుకుని సిట్ కార్యాలయం వద్ద పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

హద్దు మీరినందుకేనా!

- చెవిరెడ్డిపై పోక్సో, ఎస్సీఎస్టీ కేసులు
- మైనర్ బాలిక విషయంలో అమానవీయ రాజకీయం ఫలితం
- బలమైన సెక్షన్లతో షాక్ ఇచ్చిన జిల్లా పోలీస్
- వైసీపీ కేడర్‌లో కలకలం



తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో హద్దులు మీరుతున్నవారిపై ప్రభుత్వం కఠినచర్యలకు పూనుకుంటున్నా లెక్కలేనట్లుగా వ్యవహరిస్తున్న జిల్లా వైసీపీ నేతలకు గట్టి హెచ్చరికే ఎదురైంది. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై ఏకంగా పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వంటి తీవ్రత కలిగిన సెక్షన్లతో కేసు నమోదు కావడం వారిని నివ్వెరపరుస్తోంది. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠను దొంగ దెబ్బతీసేందుకు వైసీపీ సోషల్ మీడియాతో పాటూ జిల్లా నాయకులు కూడా రెచ్చిపోయారు. కల్తీ నెయ్యి కుంభకోణం, శ్రీవాణి నిధులపై అనుమానాలు, తిరుపతికి ఇష్టారాజ్యంగా వందల కోట్ల టీటీడీ సొమ్ములు మళ్లించడం వంటి అంశాలు భగ్గుమంటున్నా జిల్లాలోని కొందరు వైసీపీ నాయకుల దూకుడు తగ్గలేదు. మీడియా సమావేశాల్లోనూ హద్దులు దాటి వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. వీరిపట్ల ఉదాశీనంగా ఉన్నారంటూ కూటమి కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది. మరోవైపు పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులకు ఇదో హెచ్చరిక అవుతుందని జనం భావిస్తున్నారు.

లెక్కలేని తనమే కొంప ముంచుతోందా?

రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉన్నా జిల్లా వైసీపీ నాయకులు తేలిగ్గా తీసుకున్నందువల్లే వారి చాపకిందకు నీరొచ్చిందని అంటున్నారు. జగన్ అధికారంలో ఉన్నపుడు వ్యవహరించిన తీరుకు ఇప్పుడూ వీరు ఏమాత్రం తగ్గడం లేదంటున్నారు. సామాజిక బాధ్యత లేకుండా ఓ మైనర్ దళిత బాలికపై అనుచిత ప్రచారం సాగించడం, బాలిక ఉనికిని బయటపెట్టడం ప్రజలను షాక్‌కు గురి చేసింది. మైనర్ బాలికలకు సంబంధించి ఏదైనా నేరం జరిగినపుడు వారి వివరాలు బహిర్గతం చేయకూడదు. వారి పేర్లు గానీ, ఫోటోలు గానీ, వారి ఉనికిని తెలిపే ఏ ఒక్క విషయమూ వెల్లడించకూడదు. వైసీపీ నేతలు అన్నింటినీ ఉల్లంఘించారు. ఇది బాధ్యతా రాహిత్యం కాక మరేమిటవుతుందన్న ప్రశ్న ఎదురవుతోంది.

ఏ2 తర్వాత ఎవరు?

చెవిరెడ్డిపై పెట్టిన కేసు.. రెచ్చిపోతున్న మిగిలిన వైసీపీ నేతలకు గట్టి హెచ్చరికగా భావిస్తున్నారు. అనేక ఆరోపణలను ఇప్పటికే ఎదుర్కొంటున్న ఆ నాయకులకీ ఇబ్బందులు తప్పవనే చర్చ జరుగుతోంది. బాలిక వ్యవహారంలోనూ రుయా ఆసుపత్రి వద్దకు చేరుకుని హల్‌చల్ చేసిన నాయకుల పేర్లు కూడా తదుపరి జాబితాలో ఉంటాయని అంటున్నారు. ఇదే కేసులోనూ మరికొందరి పేర్లు చేరుస్తారని చెబుతున్నారు.

అమానవీయం కాదా?

ఎర్రావారిపాలెం మండలంలో ఈనెల 4న జరిగిన ఘటనలో అత్యాచారం జరిగిందని బాధిత బాలిక చెప్పలేదు. తల్లిదండ్రులు కూడా చెప్పలేదు. ఒంటిపై వున్న స్వల్ప గాయాలు చూపి తనపై దాడి జరిగిందని బాలిక చెప్పింది కూడా అబద్ధమేనని విచారణలో భాగంగా జిల్లా ఎస్పీ మరుసటి రోజే ప్రకటించారు. స్వల్ప గాయాలు సైతం బాలిక తనకు తానుగా చేసుకున్నవే తప్ప ఇతరులు చేసింది కాదని ఎస్పీ స్పష్టం చేశారు. అయితే వీటికి పూర్తి భిన్నంగా వైసీపీ నేతలు మీడియా ఎదుట ఆరోపణలు చేయడం విస్తుగొలుపుతోంది. బాలిక వివరాలు బయటపెట్టడం, చివరికి చినిగిన దుస్తులతో చికిత్స పొందుతున్న బాలిక ఫోటోను కూడా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం అంతకంటే దారుణమన్న విమర్శలు వస్తున్నాయి.

చెవిరెడ్డికి ఏమైంది?

సాధారణంగా చెవిరెడ్డి ఎవరిపైనా ఘాటు ఆరోపణలు చేసేవారు కాదు. మీడియా సమావేశాల్లోనూ ఆచితూచి మాట్లాడేవారు. అధికారంలో ఉన్న అయిదేళ్లూ సంయమనంగా ఉన్న ఆయన ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు గురవుతోంది. ఎర్రావారిపాలెం మండల ఘటనకు సంబంధించి ఈనెల 4, 5 తేదీల్లో వ్యవహరించిన తీరు భిన్నంగా వుందన్న వ్యాఖ్యలు జనం నుంచీ వినిపిస్తున్నాయి. తాను ఎంతో క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తరచూ చెప్పుకునే చెవిరెడ్డే పోలీసులు తనపై బలమైన సెక్షన్లతో కేసు పెట్టే అవకాశం ఇవ్వడమే ఇపుడు చర్చనీయాంశమవుతోంది.

డీలాపడుతున్న వైసీపీ శ్రేణులు

రాష్ట్ర వైసీపీలో బలమైన నేత, జగన్‌కి అత్యంత సన్నిహితుడు అయిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపైనే కేసు పెట్టడంతో జిల్లావ్యాప్తంగా వైసీపీ వర్గీయుల ఆందోళనకు గురవుతున్నారు. కేడర్ అయితే డీలా పడిపోతోంది. పెద్ద నాయకుల పరిస్థితే ఇలా ఉంటే తమ గతేమవుతుందనే ఆందోళన, భయం వారిలో పెరిగిందంటున్నారు.



పాఠశాల రాజ్యాంగ ప్రతులను ఆవిష్కరిస్తున్న కమిటీ

పాఠశాల రాజ్యాంగం లాంఛనంగా ఆమోదం

8లో

ఊరందూరులో వేడుకగా కార్యక్రమం

- నేడు లక్ష కుంకుమార్చన.. అంకురార్పణ

రేపటి నుంచి పద్మావతీ బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 6వ తేది వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చనను నిర్వహించనున్నారు. అమ్మవారి అష్టోత్తర శతనామావళిని లక్షసార్లు జపిస్తూ కుంకుమార్చన చేస్తారు. ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు టికెట్ కొనుగోలు చేసి పాల్గొనవచ్చు. ఇక, బ్రహ్మోత్సవాలు ప్రారంభ సూచికగా బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయంలో అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని తిరుచ్చిపై.. వెంట సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. అక్కడ పుట్టమట్టిని సేకరించి తిరిగి ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు చేరుకుని అంకురార్పణ ఘట్టానికి శ్రీకారం చుడతారు. సాయంత్రం 6నుంచి 8.30గంటలవరకు ఈ కార్యక్రమం జరుగుతుంది.

రేపు ధ్వజారోహణం

గురువారం ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్య ధనుర్లగ్నంలో ధ్వజారోహణం జరుగుతుంది. గజ ధ్వజానికి, ధ్వజస్తంభానికి పూజచేసి గజపటాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణం చేస్తారు. దీంతో ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తారు. ఆ రోజు రాత్రి ఏడు గంటలకు చిన్నశేషవాహనంతో అమ్మవారి వాహన సేవలు ప్రారంభమవుతాయి. కాగా, గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తిరుచానూరుకు చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

వాహన సేవలిలా

గురువారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం చిన్నశేషవాహనం, 29న ఉదయం పెద్దశేషవాహనం, సాయంత్రం హంసవాహనం, 30న ముత్యపుపందిరి, సింహ, డిసెంబరు 1న కల్పవృక్ష, హనుమంత, 2న పల్లకీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం, రాత్రి గజవాహనం, 3న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణరథోత్సవం, రాత్రి గరుడ, 4న సూర్యప్రభ, చంద్రప్రభ, 5న రథోత్సవం, అశ్వావాహనం, 6న మధ్యాహ్నం 12.15 గంటలకు పంచమి తీర్థం, రాత్రి 9.30 గంటలకు ధ్వజావరోహణం, 7న పుష్పయాగం.

వేడుకగా అమ్మవారి ఆలయ శుద్ధి

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయశుద్ధి (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం) నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. నామకోపు, శ్రీచూర్ణంతోపాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.

ఆర్జిత సేవల రద్దు

అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను పది రోజులపాటు రద్దు చేస్తున్నట్లు డిప్యూటీ ఈవో గోవిందరాజన్ తెలిపారు. కుంకుమార్చన, వీఐపీ, బ్రేక్, కళ్యాణోత్సవంతో పాటూ వారపు, మాసపు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. డిసెంబరు 8 నుంచి ఆర్జిత సేవలు యధావిధిగా ఉంటాయన్నారు.



ఆలయ శుద్ధి కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తదితరులు

భారత రాజ్యాంగం మహోన్నతం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగరాణి

భాకరాపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం మహోన్నతమైందని చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగరాణి అన్నారు. మంగళవారం కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు సునంద, నాగభూషణం, మల్ రెడ్డి, పూజిత, హేమలత, సుధాపూర్ణ చంద్రిక పాల్గొన్నారు.

ఆగని గజదాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన చెరకు తోట

భాకరాపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. సోమవారం రాత్రి మండలంలోని దిగవూరు పంచాయతీ శాంతినగర్‌కు చెందిన నూనె చంద్రయ్య చెరకు పంటను ధ్వంసం చేశాయి. పగలు సమీపంలోని అడవిలోకి వెళ్లడం, రాత్రి పంటలపై దాడి చేయడం పరిపాటిగా మారిందని, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఎంపీడీవో శశిరేఖ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగ విశిష్టత గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

బాక్సింగ్‌లో యోగేష్‌కి కాంస్య పతకం



తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట జెడ్పీ హైస్కూల్‌లో ఏడవ తరగతి చదివే విద్యార్థి సీహెచ్ యోగేష్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో రాణించి కాంస్య పతకాన్ని సాధించారని హెచ్ఎం పి.భారతి పేర్కొన్నారు. మచిలీపట్నంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి పోటీలలో అండర్-14విభాగంలో యోగేష్ తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభచాటారని తెలిపారు. విద్యార్థిని పలువురు టీచర్లు అభినందించారు.

నేడు కార్తీక వనభోజనం

చంద్రగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్తీక మాసంలో ద్వాదశి నాడు ఇక్కడ వనభోజన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి 9 గంటలకు శ్రీవారిమెట్టు వద్దగల పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. 10 నుంచి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. తర్వాత అలంకారం, వనభోజనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఈ కారణంగా ఆలయంలో నిత్య కల్యాణోత్సవం రద్దు చేశారు.

రోడ్డు పక్కన చెత్త డంప్ చేస్తే చర్యలు


చెత్త తొలగిస్తున్న సిబ్బంది

చంద్రగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో చెత్తను డంప్ చేస్తే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి నస్రీన్‌బేగం హెచ్చరించారు. ఎ.రంగంపేట పరిసరాల్లో విద్యా సంస్థలు, ప్రైవేటు హాస్టల్స్, హోటల్స్ యాజమాన్యాలు చెత్తను ఎ.రంగంపేట సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో డంప్ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి నస్రీన్‌బేగం దాన్ని పరిశీలించారు. అక్కడ చెత్త డంప్ చేయరాదని, ఇకపై వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- 8 నెలలుగా అసంపూర్తిగానే నిర్మాణం


గుంతలమయంగా మారిన రోడ్డు - అసంపూర్తిగా ఉన్న రోడ్డు

తిరుపతి (జీవకోన), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల బైపాస్ రోడ్డు నుంచి సత్యనారాయణపురం వరకు (జీవకోన) విరజామార్గం పేరుతో రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. కోర్టు ఇబ్బందుల నేపథ్యంలో కొంతభాగం మాత్రమే నిర్మించి వదిలేశారు. ఎనిమిది నెలలుగా అలాగే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కోర్టు ఇబ్బంది ఉన్న ప్రాంతం కాకుండా మిగిలిన స్థలంలోనైనా రోడ్డును పరిపూర్ణంగా వేస్తే వాహనదారులకు ఇబ్బందులు ఉండవు. మిట్ట ప్రాంతంలో ఎక్కువ గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు పడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

చంద్రగిరి

పిల్లల రక్షణ-సంరక్షణపై దృష్టి సారించండి


సమీక్ష చేస్తున్న వెంకటరత్నం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థలు పిల్లల రక్షణ, సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. తిరుపతి రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఇదే అంశంపై సమీక్షించారు. పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక వేధింపుల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

గంగమ్మకు అంబలి


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

తిరుపతి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గ్రామ దేవత గంగమ్మతల్లికి మంగళవారం అంబలి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

వకుళమాత సేవలో మంత్రి సత్యప్రసాద్

తిరుపతిరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మూడ్రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం సాయంత్రం తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ గ్రామంలోని వకుళమాత ఆలయాన్ని సందర్శించారు. మంత్రికి డిప్యూటీ ఈవో వరలక్ష్మి సాదరస్వాగతం పలికి, అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు. టెంపుల్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

7న ఎంపీటీ సమావేశాలు

రామచంద్రాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బడి వైపు ఒక అడుగు-తల్లిదండ్రులతో ముచ్చట్లు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు మార్కండేయుడు నాయుడు, జయవేలు తెలిపారు. ప్రతి పాఠశాలలోనూ ఈ సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు.

ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణులు ఉచిత ఇసుక పాలసీని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఇసుక అవసరమైన వారు గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా రసీదు పొంది తీసుకెళ్లవచ్చన్నారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జియో ట్యాగింగ్ ఈ నెల 30 నాటికి పూర్తిచేయాలన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెయిరీ టెక్నాలజీలో ఘనంగా పాల దినోత్సవం

- ఉత్తమ పాడిరైతు నవీనాకుమారికి సన్మానం



నవీనాకుమారిని సన్మానిస్తున్న నాగేశ్వరరావు

తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం జాతీయ పాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డెయిరీ డీన్ డాక్టర్, ఐడీఏ-ఏపీచాప్టర్ సెక్రటరీ కమ్ ట్రెజరర్ కె.నాగేశ్వరరావుతో ఏడీ డాక్టర్ రవీంద్రారెడ్డి, అధ్యాపకులు కలసి డాక్టర్ వర్గీస్ కురియన్ చిత్రపటానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. దేశంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల్లో పాల ఉత్పత్తిదారులైన మహిళల సాధికారిత కోసం కురియన్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. 2024కి ఏపీలో ఉత్తమ పాడి రైతుగా ఎంపికైన వెంకటగిరికోట గ్రామానికి చెందిన పనమారెడ్డి గారి నవీనాకుమారిని ప్రశంసాపత్రం, నగదు బహుమతితో సత్కరించారు. గ్రామీణ మహిళల సాధికారిత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు బహుమతి అందజేశారు. అసోసియేట్ డీన్ డాక్టర్ వై.రవీంద్రారెడ్డి, విద్యార్థి వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ బీఎం మంజునాథ పాల్గొన్నారు.

జగన్ బొమ్మ ఉన్న ఉంగరంతో ఆలయంలోకి నారాయణస్వామి

తిరుమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైసీపీ నాయకుల నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతూనే ఉన్నాయి. మాజీ డిప్యూటీసీఎం నారాయణస్వామి మాజీ సీఎంలు రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి ఫొటోలతో కూడిన ఉంగరాన్ని ధరించి శ్రీవారిని దర్శించుకోవడం విమర్శలకు దారితీసింది. సాధారణంగా శ్రీవారి దర్శనానికి వచ్చే వారు రాజకీయ పార్టీల గుర్తులు, వ్యక్తుల ఫొటోలు, జెండాలు, కరపత్రాలతో తిరుమలకు రావడం నిషేధం. అయితే నారాయణస్వామి మాత్రం పెద్దపరిమాణంలో రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు కనిపించేలా ఉన్న ఉంగరాన్ని ధరించి మంగళవారం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. క్యూకాంప్లెక్స్‌లోని సిబ్బంది కూడా దీన్ని పట్టించుకోకపోవడం గమనార్హం. ఇటీవల వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి కూడా ఆలయ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో వీడియోలు తీసుకోవడంతో పాటు వ్యక్తిగత విషయాలను ప్రస్తావించి విమర్శలపాలైన విషయం తెలిసిందే. దీనిపై తిరుమలలో కేసు కూడా నమోదయింది. అలాగే ఈనెల 4వ తేదీన అంబటి రాంబాబు కూడా జగన్మోహన్‌రెడ్డి ఫొటో, నవరత్నాల లోగోతో కూడిన బ్యాడ్జీని ధరించి శ్రీవారిని దర్శించుకున్నారు.

కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి కబ్జా

- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- తాజాగా ఆక్రమణకు వైసీపీ నాయకుడి యత్నం


ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి (ఇన్‌సెట్‌లో) ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

చంద్రగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలో తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. అయినప్పటికీ తమకేమీ సంబంధం లేదనట్లు రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. తాజాగా ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కబ్జా చేయడానికి కొంత భూమిని శుభ్రం చేసి, గ్రావెల్ తోలుతున్నాడు. ఎ.రంగంపేట పంచాయతీలో నాగపట్ల రెవెన్యూ లెక్క దాఖలాలో సర్వే నెంబర్ 80-ఏలో 8.31 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. పక్కనే మామిడితోపు పొరంబోకు స్థలం ఉంది. గతంలో ఈభూమిని కొంతమంది కబ్జా చేయాలని ప్రయత్నించడంతో అప్పటి రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని, ఇందులో ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు కూడా పెట్టారు. రోజు రోజుకు భూముల విలువ పెరగడం, అదే పంచాయతీ పరిధిలో విద్యాసంస్థలు ఉండటంతో భూములకు మరింత డిమాండ్ ఏర్పడింది. తిరుపతి నగరంలో కంటే ఎ.రంగంపేట పంచాయతీలో ఇంటి అద్దెలు కూడా అధికంగానే ఉన్నాయి. దీంతో ఆగ్రామానికి చెందిన కొంతమంది ఆర్థిక, అంగబలం ఉన్న నాయకులు సర్వే నెంబర్ 80-ఏలో కొంత భూమిలో తాత్కాలికంగా ఇంటి నిర్మాణాలు చేపట్టి, విద్యుత్ మీటర్లు కూడా ఏర్పాటు చేసుకొన్నారు. తాజాగా జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న స్థలంపై వైసీపీ నాయకుడి కన్ను పడింది. దీంతో ఆస్థలాన్ని కబ్జా చేయడానికి శుభ్రం చేసి, గ్రావెల్ తోలుతున్నాడు. దీనిపై స్థానిక రెవెన్యూ సిబ్బంది అతడిని ప్రశ్నిస్తే.. తనకు పట్టా ఉందని చెబుతూ, అసలు నన్ను ప్రశ్నించడానికి మీకేమి సంబంధం అంటూ దురుసుగా మాట్లాడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూముల్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ శివరామసుబ్బయ్యను వివరణ కోరగా,కబ్జా విషయం తన దృష్టికి వచ్చిందని, గ్రావెల్ తోలుతుండగా ఆపమని చెప్పామని అన్నారు. అయితే వాళ్ల ఏదో పట్టా ఉందని చెబుతున్నారని, ముందు రికార్డులు తెచ్చిన తరువాత పనులు చేసుకోవాలని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ రహదారిలో వారానికోసారి శానిటేషన్


శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామచంద్ర

తిరుపతి రూరల్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ప్రతి మంగళవారమూ పారిశుధ్య పనులు నిర్వహించేలా ఎంపీడీవో కె.రామచంద్ర చర్యలు చేపట్టారు. ఈ మేరకు కాలూరు క్రాస్ వరకు జాతీయ రహదారికి పక్కన 5మీటర్ల వెడల్పులో ఉన్న మొక్కలు, చెత్త, వ్యర్థాలను ఎక్స్‌కావేటర్ సాయంతో తొలగింపు ప్రక్రియ చేపట్టారు. రామానుజపల్లె వద్ద పనులను ఎంపీడీవో పరిశీలించారు. తుమ్మలగుంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నెలాఖరుకు హౌస్‌హోల్డ్, ఎన్‌పీసీఐ సర్వే పూర్తి : ఈ నెలాఖరుకు హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్, ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సర్వేలని పూర్తి చేయాలని రూరల్ మండల ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. మండలంలోని సచివాలయాల్లో పనిచేసే ఏఎన్ఎం మినహా మిగిలిన ఉద్యోగులందరూ తప్పకుండా ఈ సర్వేలో భాగస్వాములై త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.

● విద్యాసంస్థల్లో ఆధార్ సేవా శిబిరాలు: తిరుపతి రూరల్ మండలంలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం నుంచి ఆధార్‌సేవా శిబిరాలను ప్రారంభించారు. సంస్కృతి జూనియర్ కళాశాల(తిరుచానూరు), శ్రీచైతన్య కళాశాల(తిరుచానూరు, పాడిపేట, దుర్గసముద్రం, పేరూరు)ఏ1ఎస్ఆర్ఐ అకాడమీ(పెరుమాళ్లపల్లె), ఎస్ఆర్ జూనియర్ కాలేజీ(శ్రీనివాసపురం), అను ఒకేషనల్ జూనియర్ కాలేజ్ (ధనలక్ష్మినగర్)లలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 29వ తేదీ వరకు ఈసేవా శిబిరాలు కొనసాగుతాయని ఎంపీడీవో పేర్కొన్నారు.

అభివృద్ధి అంటే చేసి చూపిస్తా : నాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళ వారం చంద్రగిరిలో చిరు వ్యాపారు లతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. నాని మాట్లాడుతూ చంద్రగిరి అభివృద్ధికి వ్యాపారులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కొన్నేళ్లుగా చంద్రగిరి అభివృద్ధికి నోచుకోలేదని, గత పాలకులు గొప్పలు చెప్పుకున్నారే తప్పా చేసిందేమీ లేదని అన్నారు. శ్రీకృష్ణదేవరాయల కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు న్యాయం చేస్తామన్నారు. చంద్రగిరి పట్టణంలో మినీ ఆడిటోరియం, శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఏర్పాటు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, అభివృద్ధి కమిటీ మెంబర్లు రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా, డాక్టర్ వాసు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సురేష్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, జడ్పీటీసీ యుగంధర్, బాలకృష్ణమూర్తి, సంగీతం విశ్వనాథం పాల్గొన్నారు.

లీడర్‌షిప్ శిక్షణ పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రామచంద్రాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీరామాపురం వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్న లీడర్‌షిప్ శిక్షణను స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయరామరాజు మంగళవారం తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ నిర్వహించడం వలన ఉపాధ్యాయులు ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకుని పాఠశాలను సమర్థవంతంగా నిర్వహించడానికి దోహదపడుతుందన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా అందించాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్యాముల్, ఏఎంవో శివశంకరయ్య, అసిస్టెంట్ ఏఎంవో మధు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


సర్టిఫికెట్లు అందిస్తున్న మాజీ రిజిస్ట్రార్ పుల్లారెడ్డి, పక్కనే తిప్పారెడ్డి - గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాయలసీమ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్వీ పుల్లారెడ్డితో కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు కలసి అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. భారత రాజ్యాంగం-అంబేడ్కర్ కృషి అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు జూలీ, ధీరజ్, శ్రీనివాస్, దీవెన తదితరులు పాల్గొన్నారు.

●ఎంపీడీవో కార్యాలయంలో: రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ, వెలుగు కార్యాలయ సిబ్బందితో ఎంపీడీవో రామచంద్ర కలసి గాంధీజీ, అంబేడ్కర్ల చిత్రపటాలకు పుష్పాంజలితో నివాళి అర్పించారు. కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రాపురంలో నివాళి అర్పిస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

రామచంద్రాపురం: ఆర్‌సీపురం ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీడీవో ఇందిరా, తహసీల్దారు వెంకటరమణ పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

నారా రామ్మూర్తి కర్మక్రియలకు శరవేగంగా ఏర్పాట్లు


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే నాని, నారా గిరీష్, రోహిత్

చంద్రగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నారావారి పల్లెలో గురువారం జరిగే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈఏర్పాట్లును కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మంగళవారం పరిశీలించారు. భోజనశాల, కర్మక్రియలకు పిండ ప్రదానం చేసే ప్రదేశం, వాహనాల పార్కింగ్, నివాళులు అర్పించడానికి ప్రత్యేక షెడ్డును పరిశీలించారు. కర్మక్రియలకు వేలాదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్న నేపథ్యంలో భోజనాలు, వాహనాల పార్కింగ్ వద్ద ఎవరికీ ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్, ఎస్పీ అధికారులకు సూచించారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్డీవోలు భానుప్రకాష్ రెడ్డి, రామ్మోహన్, డీపీవో సుశీలాదేవి, ఎస్పీడీసీఎల్ సురేంద్రనాయుడు, ఈఈ వాసురెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే, రామ్మూర్తి నాయుడి కుమారులు నారా గిరీష్, నారా రోహిత్ కూడా ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడుతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు రమేష్‌రెడ్డి, కోదండరామానాయుడు, నిరంజన్‌నాయుడు, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, లోకాద్రినాయుడు, కొండూరు ప్రవీణ్‌రాయల్, గిరిధర్‌నాయుడు, రాకేష్‌చౌదరి, రాజులగారి వినోద్, శ్రీకాంత్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

నారావారిపల్లిలో భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో గురువారం రామ్మూర్తి నాయుడి కర్మక్రియల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎస్పీ సుబ్బరాయుడు నేతృత్వంలో పోలీసులు మంగళవారం రేణిగుంట విమానాశ్రయం నుంచి నారావారిపల్లె వరకు రెండుసార్లు అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించారు. సీఎంతో పాటు డిప్యూటీ స్పీకర్, మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు హాజరవుతున్నారు. వీఐపీలు తరలి రానున్నారు. దీంతో బుధవారం నుంచే బందోబస్తు పెంచనున్నారు. తిరుపతి పద్మావతి అతిథి గృహంతో పాటు సీఎం, మంత్రులు పర్యటించే అన్ని ప్రాంతాల్లో పోలీసు బలగాలను నియమించారు. అనంతపురం డీఐజీతో పాటు ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో నలుగురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 80 మంది ఎస్ఐలు, మరో 600 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, రోప్ పార్టీలు, రోడ్డు డిగ్గింగ్ పార్టీలు, డాగ్, బాంబు స్క్వాడ్లు, రిజర్వు బలగాలు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నాయి. ఇప్పటికే సీఎం భద్రతా బలగాలు గ్రామం చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించేలా మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేస్తున్నారు.

పీఏసీ-5 పనులు త్వరగా పూర్తిచేయండి

- అదనపు ఈవో



తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో టీటీడీ నిర్మిస్తున్న నూతన యాత్రికుల వసతి సముదాయం-5(పీఏసీ) నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన పీఏసీ5 నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ పనుల స్థితిపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 16 హాళ్లలో 8 హాళ్ల ఫ్లోరింగ్ పూర్తియిందని, మిగిలినవి చేయాల్సి ఉందన్నారు. నాణ్యతలో రాజీ పడకూడదని అదనపు ఈవో సూచించారు. ఈ భవనంలో ఏర్పాటు చేస్తున్న అన్నప్రసాదం డైనింగ్ హాల్, కల్యాణకట్ట, డిస్పెన్సరీ సదుపాయాలపైనా అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఈవోలు రాజేంద్ర, వెంకటయ్య, ఆశాజ్యోతి, ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి పరదాల విరాళం



తిరుచానూరు, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి మంగళవారం పరదాలు విరాళంగా అందాయి. హైదరాబాదుకు చెందిన స్వర్ణకుమార్‌రెడ్డి ఆరు పరదాలు, రెండు కురాళాలు, తిరుపతికి చెందిన సుధాకర్, జయచంద్రారెడ్డి, అరుణ్‌కుమార్ నాలుగు పరదాలు, 25 హుండీ వస్త్రాలను జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మంకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబుస్వామి, ఆలయ సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల పెన్షన్ సవరణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డి.వెంకటేశ్వరరావు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు సవరించిన పెన్షన్‌ను చెల్లించాలని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సర్కిల్ శాఖ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు కోరారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు సత్రంలో మంగళవారం బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు చెల్లించే పింఛన్‌ను 2017లో సవరించినా నేటికీ అమలు చేయలేదన్నారు. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం, సంస్థ నిర్లక్ష్యం వహించడం అన్యాయమన్నారు. ఏడవ వేతన సంఘం సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. సంఘం జాతీయ కార్యదర్శి వరప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావులు పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుర్రప్ప, కోటేశ్వరరావు పాల్గొన్నారు. బుధవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని గుర్రప్ప తెలిపారు.

ఆయుర్వేదంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యులు, సిబ్బంది

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని డాక్టర్ వి.విజయకుమార్ అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ దేశ్‌కా ప్రకృతి పరిక్షాన్ అభియాన్ యాప్ గురించి వివరించారు. అన్ని రోగాల నివారణకు ఆయుర్వేదంలో మందులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డి.శశిరేఖ, శ్రీపద్మావతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



లక్ష్మీకర్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఖజానా శాఖ (ట్రెజరీ) అధికారి లక్ష్మీకర్‌రెడ్డి తెలిపారు. ట్రెజరీ శాఖకు సంబంధించి ఉద్యోగులు, పెన్షనర్లకు ఎటువంటి సందేహాలు ఉన్నా తిరుపతి, చంద్రగిరి, పాకాల, పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, వాకాడు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాలలోని సబ్ ట్రెజరీల్లో తెలియజేయాలని కోరారు. నివృత్తి చేయడానికి తమ శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

గంగమ్మ ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న పనులను త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. రానున్న జాతర నాటికి ప్రజలకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం తమ బాధ్యతని తెలిపారు. ఆలయ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆలయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అమ్మవారి దర్శనంలో పారదర్శకతను తీసుకురావడంతో పాటు ఆలయ సంప్రదాయాలు తూచా తప్పకుండా పాటిస్తామన్నారు. ఆలయాభివృద్ధికి దాతలు ఇతోధికంగా విరాళాలు ఇవ్వాలని కోరారు. పనుల తీరును ఇంజినీరింగ్ అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. ఆలయ ఈవో జయకుమార్, కూటమి నేతలు నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, పులిగోరు మురళి, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, మహేష్ యాదవ్, భరణియాదవ్, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, దొడ్డారెడ్డి శ్రీనివాసులు, గంజి సుధాకర్ రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుయాలో అన్నదానం



అన్నదానం చేస్తున్న రాము రాయల్ స్నేహితులు

తిరుపతి(వైద్యం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త రాము రాయల్ జన్మదినం సందర్భంగా ఆయన స్నేహితులు రుయాస్పత్రిలో మంగళవారం అన్నదానం చేశారు. 2 వేల మందికి పైగా పేదలు, రోగుల సహాయకులకు భోజనం అందించారు. పేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలతో పాటు పలుచోట్ల అన్నదానం చేసినట్లు రాము రాయల్ స్నేహితులు పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



సునీల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశిష్ట అద్వైత వేదాంత విభాగ పరిశోధకులు ఆర్.సునీల్ డాక్టరేట్ పొందారు. దేవరాజ విరచిత సిద్ధాంత న్యాయ చంద్రికాయః సంపాదనం, అధ్యయనంచ అంశంపై ఆయన సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఇప్పటి వరకూ సునీల్ రెండు జాతీయ సదస్సులు, రెండు వర్క్‌షాపుల్లో పాల్గొన్నారు. ఆయన రూపొందించిన నాలుగు పరిశోధనా పత్రాలు ప్రముఖజర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ సాంబశివమూర్తి తెలిపారు.

స్థూలకాయంతో ఆరోగ్య సమస్యలు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుకుమార్

తిరుపతి(వైద్యం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థూలకాయంతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, ప్రధానంగా ఎముకల్లో క్యాల్షియం తగ్గి అర్థరైటిస్ వంటి సమస్యలు పెరుగుతాయని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ సుకుమార్ అన్నారు. ప్రపంచ ఒబెసిటీ దినోత్సవం సందర్భంగా సాయిసుధా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అధిక బరువుకు కారణాలు, అనర్థాలు, నివారణ మార్గాల గురించి రోగులకు అవగాహన కల్పించారు. ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పైగా రోగులకు ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించారు.

ఉపాధ్యాయులను వేధించొద్దు : ఆపస్

తిరుపతి(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బోధనేతర బాధ్యతలతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులను మరింతగా వేధించొద్దని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) పేర్కొంది. ఉపాధ్యాయుల సెలవులపై పరిమితి విధిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాన్ని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో ఖండించారు. ఉపాధ్యాయులు వారికున్న సాధారణ సెలవులు (సీయల్స్), ప్రత్యేక సాధారణ సెలవులు (ఎస్సీ యల్స్) వినియోగించుకోవడంపై ఆంక్షలు విధించడం శోచనీయమని పేర్కొన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు.

సీఎంకు కృతజ్ఞతలు



అభినందనలు తెలుపుతున్న ఉద్యోగ సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణపై కేసులు వీగిపోవడంపై జిల్లా అధ్యక్షుడు తులసీరామ్ హర్షం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లకు జిల్లా సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ట్రెజరీ కార్యాలయం ఎదుట ఏపీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బ్యానర్ ప్రదర్శించారు. జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, కోశాధికారి మధుబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి, కరీముల్లా, కోటీశ్వరరావు, ప్రసాదరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కామన్ కమిటీ శుభపరిణామం

బీజేపీ నేత నవీన్



తిరుపతి (జీవకోన), నవంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుమల మఠాలపై కామన్ కమిటీ ఏర్పాటు శుభపరిణామమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కొన్ని మఠాలు ప్రైవేటు వ్యాపార సంస్థలుగా మారిపోయి అద్దెగదుల ధరలు, పెళ్లిళ్ల సీజన్‌లో భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నాయన్నారు. దీనిపై గతనెల 22వ తేదీ తాను టీటీడీ ఈవో శ్యామలరావును కలిసి వినతిపత్రం ఇవ్వగా ఆయన స్పందించారన్నారు. ఈ క్రమంలో కామన్ కమిటీ నియమించారన్నారు. దీనిపై ఆయన ఈవో, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

జీవిత చరిత్రలపై నేడు ఎస్వీయూలో సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవితాలను మార్చే జీవిత చరిత్రలు అంశంపై బుధవారం ఎస్వీయూలో సదస్సు నిర్వహించనున్నారు. తెలుగు విభాగం - విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య - ఈ తరం కవితా వేదిక - తిరుపతి జిల్లా రచయితల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో సభ ప్రారంభం కానుంది. విద్యార్థులు, పరిశోధకులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు కోరారు.

నేడు వెంకట సుబ్బారావు స్మారకోపన్యాసం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో పోపూరి వెంకట సుబ్బారావు స్మారకోపన్యాసం బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సావేరీ హాల్లో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ ఉమ, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత్రి ఓల్గా పాల్గొంటారు. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని సదస్సు సంచాలకులు డాక్టర్ దొమ్మరాజు యువశ్రీ కోరారు.

రుయా రోగులకు కొత్త రోగాలు

- ఆస్పత్రిలో మచ్చుకైనా కానరాని పారిశుధ్యం
- పేరుకున్న చెత్త కుప్పలు
- పురుగులతో నిండిన మరుగుదొడ్లు
- రోడ్లపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు



ఆపరేషన్ థియేటర్ వెనుక పేరుకున్న బయో వ్యర్థాలను తింటున్న కుక్కలు, టీబీ వార్డులో పురుగులతో నిండిన మరుగుదొడ్డి, నీటి తొట్టిలోకి చొచ్చుకొచ్చిన వేర్లు

తిరుపతి(వైద్యం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జబ్బులతో బాధపడుతూ వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చే రోగులు కొత్త రోగాలతో ఇళ్లకు తిరిగి వెళుతున్న దుస్థితి నెలకొంది. రాయలసీమకు తలమానికంగా ఉన్న రుయాస్పత్రిలో పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ నెలకు రూ.80 లక్షలు వెచ్చిస్తోంది. అధికారులు నిధులు ఖర్చు చూపిస్తున్నారే తప్పా ఆ మేరకు పారిశుధ్యం మెరుగుపడడం లేదన్న విమర్శలున్నాయి. ఆస్పత్రిలో ఎటుచూసినా దుర్వాసన వెదజల్లుతున్న వార్డులు, మరుగుదొడ్లు, పరిసరాలు కనిపిస్తాయి. ప్రధానంగా కార్యాలయ భవనంలోని ఓటీలో నిత్యం అనేక సర్జరీలు చేస్తుంటారు. రోగుల శరీరాల నుంచి తొలగించిన వ్యర్థాలను(బయో వ్యర్థాలను) ఆపరేషన్ థియేటర్ వెనుకే పడేస్తున్నారు. ఇవి కుక్కలకు ఆహారంగా మారుతున్నాయి. పైగా కొన్ని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నాయి. టీబీ రోగులు చికిత్స పొందే వార్డులో మరుగుదొడ్లు పురుగులతో నిండి దుర్వాసన వస్తున్నాయి. నీటి తొట్టిలో చెట్ల వేర్లు చేరి పూర్తిగా కలుషితమవుతున్నాయి. ఈ మరుగుదొడ్లను, నీటిని వాడిన టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితి క్షీణించే అవకాశముంది. చిన్నపిల్లల వార్డు పరిసరాల్లో ఎటు చూసినా చెత్త కనిపిస్తోంది. పరిసరాల్లో డ్రైనేజీ నీరు ప్రవహిస్తోంది. అప్పుడే పుట్టిన శిశువులు సైతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటారు. ఇలాంటి వాతావరణంలో వారు అనారోగ్యం బారినపడే అవకాశాలున్నాయి. పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన ఏజెన్సీ నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుని అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించకపోతే పరిస్థితి మరింత క్షీణించే ప్రమాదముంది.

ఘనంగా భారత రాజ్యాంగ వజ్రోత్సవం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు, అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

తిరుపతి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ వజ్రోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. అంబేడ్కర్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీటీఓ హరీష్‌రావు రాజ్యాంగ విలువలను తెలియజేశారు. అంబేడ్కర్ భవన్ ఛైర్మన్ డాక్టర్ పి.పరమశివన్ దేశంలో ప్రతి పౌరుడూ స్వేచ్ఛగా బతికే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. కార్యదర్శి కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత రాజ్యాంగాన్ని చదవాలని, చదివించాలని కోరారు. పూజారి అన్నాస్వామి పుష్పరాజ్, మొగిలప్ప, కె.మురళి, కృష్ణయ్య, రామచంద్రయ్య, పి.ఇంద్రముని, ఎస్.సుబ్రహ్మణ్యం, కె.రాధాకృష్ణ, సి.రెడ్డెప్ప, పున్నాక సురేష్, రామ్మూర్తి, రఘురాములు, అశోక్‌సామ్రాట్, చరణ్, గురవయ్య, ప్రసాదరావు, మహేష్ పాల్గొన్నారు.

తిరుపతి(విద్య): ప్రపంచంలోనే మనది అత్యుత్తమ రాజ్యాంగమని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రకాష్‌బాబు చెప్పారు. కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాతి నిర్మాణానికి దిక్సూచి రాజ్యాంగమని, ప్రతి పౌరుడూ దానిపట్ల విధేయత కలిగి, రాజ్యాంగ మౌలిక లక్షణాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పౌరశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సీఎల్ చెన్నారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు,ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

తిరుపతి(నేరవిభాగం): నవ సమాజం కోసం అందరూ ముందుకు సాగాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎస్పీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ వివక్ష, అన్యాయానికి భయపడకుండా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందే వాతావరణాన్ని సృష్టించడానికి కృషి చేయాలని కోరారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ గిరిధర్, రిజర్వు పోలీసులు పాల్గొన్నారు.

తిరుపతి(ఆటోనగర్): రాజ్యాంగం పట్ల అవగాహన అవసరమని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సదరన్ డిస్కం కార్యాలయం ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కలిగి ఉండాలని కోరారు. డైరెక్టర్ వై.లక్ష్మీనరసయ్య, సీజీఎంలు డీఎస్ వరకుమార్, కె.ఆదిశేషయ్య, జానకిరామ్, జీఎంలు పి.మురళి, వెంకటరాజు, ప్రసాద్, రామచంద్రరావు, సురేంద్రరావు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టి.జయరామ్, ఐ.సుబ్రమణ్యం, జనార్దనరావు, పాల్గొన్నారు.

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎస్వీ, పద్మావతి, వేద, సంస్కృత యూనివర్సిటీ, వ్యవసాయ కాలేజీల్లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా యూనివర్సిటీల అధికారులు అంబేడ్కర్ చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగ ప్రాముఖ్యతను విద్యార్థులు, ఉద్యోగులకు తెలియజేశారు.

తిరుపతి: రాజ్యాంగం మార్గదర్శకాలతో అందరికీ సమన్యాయం అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో భారత రాజ్యాంగ ప్రవేశిక ఆమోద దినం సందర్భంగా బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి కమిషనర్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాజ్యాంగ ప్రవేశిక చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహ ఆచారి, నరేంద్ర, అనిల్ కుమార్, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, ఆర్వోలు సేతుమాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర, సెక్రటరీ రాధిక పాల్గొన్నారు.

తిరుపతి(వైద్యం): వివక్షల నడుమ కొట్టుమిట్టాడుతున్న దేశానికి భారత రాజ్యాంగం ఆమోదించినప్పుడే పూర్తి స్వాతంత్ర్యం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు బాల గురవం బాబు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమటం వెంకట నరసింహులు, సుప్రజ, లోకేష్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు స్వరూప్ నాయక్, బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు చిరంజీవి, నేతలు మల్లికార్జున్, గోపీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు, సీఐటీయూ నేతలు

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న 21 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయమని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కి ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్లో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2019 సంవత్సరం నుంచి వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న ఉద్యోగులను ఏ కారణం చూపకుండా, ముందస్తు నోటీస్ ఇవ్వకుండా రాజకీయ కక్ష వేధింపులతో విధుల నుంచి తప్పించారని తెలిపారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేస్తామన్నారు.

మ్యాన్ హోల్స్ సమం చేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాలుక్కాళ్ల మండపం సర్కిల్ నుంచి బండ్ల వీధికి వెళ్లే మార్గంలో సమాంతరంగా వేయాల్సిన మ్యాన్ హోల్స్ నాలుగైదు అంగులాలు పైకి లేవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజుల క్రితం 'మ్యాన్‌హోల్స్ మార్చండి సారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. మ్యాన్ హోల్స్‌ను సరిచేస్తూ రోడ్డు వేశారు.

మాతృప్రేమను చాటే దేవకీ నందన వాసుదేవ

● గల్లా అరుణకుమారి



చిత్తూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):దేవకీ నందన వాసుదేవ చిత్రంలో తన మనవడు గల్లా అశోక్ చాలా బాగా నటించాడని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అభినందించారు. మంగళవారం చిత్తూరు రాఘవ థియేటర్‌లో టీడీపీ నాయకులతో కలసి సినిమాను ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సనాతన ధర్మం, మాతృప్రేమను తెలియజేసే సినిమా అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,ముడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, మోహన్ రాజ్ పాల్గొన్నారు.

సాగర పోరాటం

సముద్రంతో పెనవేసుకున్న బంధం వారిది. చావైనా..బతుకైనా అక్కడే. పోరాటమూ సముద్రంతోనే, ప్రేమా సముద్రంతోనే. తిరుపతి జిల్లాలో 67 కిలోమీటర్ల పొడవైన సముద్రతీరంలోని 32 మత్స్యకార గ్రామాల ప్రజల జీవనశైలి భిన్నంగా ఉంటుంది.



మత్స్యకారులు అర్ధరాత్రి దాటగానే నిద్ర లేస్తారు. వలలు భుజాన వేసుకుని తీరానికి చేరుకుంటారు. ఒంటి గంటకంతా నాటుపడవల్లో సముద్రంలోకి ప్రయాణం మొదలు పెడతారు. ఎగిసి దూకే అలలకు ఎదురేగుతారు. తీరం నుంచి దాదాపు 5 కిలోమీటర్ల దూరం దాకా సముద్రంలో ప్రయాణం చేస్తారు. చీకటి తెరల మాటునే వేట సాగిస్తారు. వలలకు చిక్కిన సంపదను పడవల్లో నింపుకుని వెనక్కి బయలుదేరుతారు. ఉదయం ఎనిమిదికల్లా తీరానికి చేరుకుని వలలు విప్పుతారు. ఆడవాళ్లు అప్పటికే అక్కడకి చేరుకుని ఉంటారు. చేపా, రొయ్యా, ఎండ్రకాయ.. దొరికినవి వేరు చేసుకుని అమ్ముకుంటారు. 4 వేల మంది రోజువారీ జీవనం ఇది. ఏటా దాదాపు అయిదు వేల టన్నుల మత్స్య సంపదను వీరు సముద్రం నుంచి సేకరిస్తున్నారు. వాకాడు మండలంలోని కొండూరుపాళెం, తూపిలిపాళెం మత్స్యకార గ్రామాల్లో 1800 కుటుంబాలు ఇదే జీవనతో ఉన్నారు. వీరు పగలంతా తెగిన వలలు తిరిగి అల్లుకుంటూ గడుపుతారు. చదువుల మీద దృష్టి పెట్టరు. చిన్న వయసు నుంచే సముద్ర వేటకు బయలుదేరుతారు.



- వాకాడు, ఆంధ్రజ్యోతి





ఆడంబరాలూ.. అప్పులూ

వేట ద్వారా వేల రూపాయల ఆదాయం పొందుతున్నా.. వీరి దగ్గర ఎప్పుడు డబ్బులుండవు. వలలకూ, పడవల మరమ్మతులకూ భారీగా ఖర్చు అవుతుంది. వడ్డీకి అప్పుచేస్తారు. నోటిమాట మీద లక్షల అప్పు వీరికి ముడుతుంది. చేసిన కష్టమంతా తిరిగి అప్పుతీర్చడంలోనే కరిగిపోతుంది. ఊరి సంబరాలు ఆడంబరంగా నిర్వహిస్తారు. భారీగా ఖర్చు చేస్తారు. లక్షల అప్పు తెచ్చి మరీ వేడుకలు జరుపుకుంటారు. ఈ అప్పును ఇంటికింతని భరిస్తారు. అప్పులేని ఇల్లు మత్స్యకార గ్రామాల్లో దాదాపుగా ఉండదు.

పెద్దల మాటే శాసనం

మత్స్యకారులు ఒకే మాట మీద ఉంటారు. గ్రామ పెద్దలకు విలువ ఇస్తారు. పెద్దకాపు, నడిమికాపు, చిన్నకాపు అని గ్రామానికి ముగ్గురు పెద్దలుంటారు. వీరు చెప్పిందే తీర్పు. వీరి మాటే శాసనం. ఎవరూ అతిక్రమించరు. ఈ కట్టును దురాయి అంటారు. గొడవలు పడ్డా పోలీసుల దాకా వెళ్లరు.



గౌతమ్ అదానీని అరెస్ట్ చేయాలి

- ఆ అవినీతిలో భాగస్వామి అయిన మాజీ సీఎం జగన్ స్పందించాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్



తిరుపతి (కలెక్టరేట్), నవంబరు26(ఆంధ్రజ్యోతి): 'అదానీని తక్షణమే అరెస్టు చేయాలి. ఆయనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి. ఆయనపై సీబీఐ, ఈడీ దర్యాప్తు జరిపించాలి' అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండు చేశారు. కేంద్ర కార్మిక.. రైతు సంఘాల పిలుపు మేరకు మంగళవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వీరికి పలు కార్మిక సంఘాలు సంఘీభావంగా ప్రకటించాయి. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. గౌతమ్ అదానీతో విద్యుత్ ఒప్పందాలు చేసుకున్న రాష్ట్రాలకు రూ.కోట్లలో లంచం ఇచ్చినట్లు అమెరికాలో కేసు నమోదైందని గుర్తుచేశారు. ఈ అవినీతి భాగస్వామిగా ఉన్న మాజీ సీఎం జగన్ దీనిపై స్పందించాలన్నారు. ఆయనా అవినీతిలో కూరుకుపోయారని పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఆదానీతో చేసుకున్న ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. కార్మిక, కర్షక ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ఐఎఫ్‌టీయూ నాయకురాలు భారతి డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో ఏపీ రైతు సంఘం నేత రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రైతు సంఘాల సమాఖ్య నాయకులు మాంగాటి గోపాల్‌రెడ్డి, వామపక్ష పార్టీ నేతలు రాధాకృష్ణ, విశ్వనాథ్, హేమలత, రవి, లక్ష్మి, జయచంద్ర, సుబ్రహ్మణ్యం, సాయిలక్ష్మి, ఐఎఫ్టీయూ కార్మిక సంఘ నేత వెంకటరత్నంతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

లాంఛనంగా పాఠశాల రాజ్యాంగం ఆమోదం





కమిటీ అధ్యక్షురాలు రాజకుమారి ఆధ్వర్యాన రాజ్యాంగ పరిషత్ సమావేశం

శ్రీకాళహస్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల రాజ్యాంగాన్ని మంగళవారం లాంఛనంగా ఆమోదించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల రాజ్యాంగాన్ని ఇటీవల ఉపాధ్యాయులు, విద్యార్థులు కమిటీగా ఏర్పడి రచించిన విషయం తెలిసిందే. పాఠశాల రాజ్యాంగ పరిషత్ అధ్యక్షురాలిగా హెచ్ఎం రాజకుమారి, రచనా సంఘం చైర్మన్‌గా కూనాటి సురేష్, హక్కుల కమిటీ చైర్మన్‌గా రమేష్‌బాబు, విధుల కమిటీ చైర్మన్‌గా శ్రీనివాసులు, అధికారాల కమిటీ చైర్మన్‌గా మురళి, విధి విధానాల చైర్మన్‌గా రజియా, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల చైర్మన్‌గా మల్లికార్జున, ఆర్థిక కమిటీ చైర్మన్‌గా శాంతి, ఇతర కమిటీలకు చైర్మన్లుగా సుమతి, బిందు తదితరులు వ్యవహించారు. 193మంది విద్యార్థులు రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా అలనాటి వస్త్రధారణలో హాజరయ్యారు. ముందుగా అధికారిక లాంఛనాలతో పాఠశాల రాజ్యాంగాన్ని ఆమోదించారు. అనంతరం ప్రధాన కమిటీ సభ్యులు ప్రతులను ఆవిష్కరించారు. ఆ తరువాత భారత రాజ్యాంగ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల రాజ్యాంగంలోని ప్రవేశికను సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందిచారు.

మన రాజ్యాంగం మహోన్నతం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో కెల్లా మన భారత రాజ్యాంగం మహోన్నతమైదని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిగా నడుచుకోవాలని, త మార్గదర్శకాల మేరకు అధికారులూ సేవలు అందించాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన భారత రాజ్యాంగ ప్రవేశిక ఆమోద దినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగ ప్రవేశిక చదివి అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సాల్, డీఆర్వో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం ఆనవాళ్ల లభ్యంపై

పోలీసుల దర్యాప్తు వేగవంతం



మృతదేహం ఆనవాళ్లు లభ్యమైన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి మిస్సింగ్ కేసులో ఆరు నెలల తరువాత మృతదేహం ఆనవాళ్లు లభ్యం కావడంపై పాకాల పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సీఐ కె.మద్దయ్య ఆచారి మంగళవారం క్లూస్ టీం, ఫోరెనిక్స్ నిపుణులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి మృతదేహం ఆనవాళ్లు లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఉమర్ ఫరూఖ్ అవశేషాలను గుర్తించి ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపించారు. 'ఉమర్ ఫరూఖ్ మే 4న రాత్రి ఎన్నికల నిమిత్తం లారీలో అక్రమంగా తెచ్చిన మద్యం దింపడానికి మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులను చూసి పారిపోయాడు. పంటపల్లె దగ్గర కె.కిరణ్ కుమార్ రెడ్డి భూమిని మోహన్ రెడ్డి లీజుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. మోహన్‌రెడ్డి పందుల కోసం పొలం దగ్గర కరెంటు తీగలను అమర్చాడు. పారిపోతున్న ఫరూఖ్ కాలికి కరెంటు తీగ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరుసటిరోజు ఉదయం మోహన్ రెడ్డి పొలంవద్ద ఫరూఖ్ మృతదేహాన్ని గుర్తించి భార్య సాయంతో సమీపంలోనే పూడ్చివేశారు' అని సీఐ వివరించారు. ఐడీ పార్టీ పోలీసుల ద్వారా ఘటన వివరాలు తెలియడంతో ఈ దారుణం వెలుగు చూసింది. మృతదేహాన్ని పూడ్చేసిన మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేస్‌బాల్ టోర్నీ విజేతలు ఉమ్మడిజిల్లా బాలబాలికల జట్లు





ట్రోఫీలను అందుకుంటున్న బాలురు, బాలికల జట్లు

తిరుపతి(క్రీడలు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ 14 బేస్‌బాల్ విజేతలుగా ఉమ్మడి చిత్తూరుజిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. తిరుపతి శివారు మంగళంలోని ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా బేస్‌బాల్ పోటీలు జరిగాయి. అత్యుత్తమంగా రాణించిన జట్లను విజేతలుగా ప్రకటించడంతో పాటు 32(బాలురు 16, బాలికలు 16)మంది క్రీడాకారులను జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. మంగళవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, అనిత్‌కుమార్‌రెడ్డి విజేతలకు ట్రోఫీలు, బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

విజేతల వివరాలిలా

బాలుర విభాగం: ఉమ్మడి చిత్తూరుజిల్లా, విజయనగరం, వైఎస్సార్ కడప మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి.

బాలికల విభాగం: తొలి మూడు స్థానాలను ఉమ్మడి చిత్తూరు జిల్లా, శ్రీకాకుళం, వైఎస్సార్ కడప జట్లు సాధించాయి.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారు

బాలుర విభాగం: నవీన్‌కుమార్, కార్తీక్, అజిత్, తౌఫిక్(చిత్తూరు), పవన్, జోయల్, మోహన్‌కృష్ణ(విజయనగరం), బి.సంతోష్, ఎం.సంతోష్, కైఫ్(కడప), జస్వంత్(కృష్ణా), తులసీరాజ్(వైజాగ్), లోహిత్(అనంతపురం), వంశీ(శ్రీకాకుళం), చైతన్య(ప్రకాశం), వంశీ(కర్నూల్), స్టాండ్ బైగా గుణశ్యామ్(చిత్తూరు), జీవన్(వైజాగ్), హరినాథ్(కడప), గౌతం(విజయనగరం).

బాలికల విభాగం: రమ్య, శ్రీభవ్య, శ్రీహిమజ, నిరోష(చిత్తూరు), వినయలక్ష్మి, హరిణి, జీవిత(శ్రీకాకుళం), తనుజ, వైష్ణవి(కడప), మౌనిక(విజయనగరం), గాయత్రి(కృష్ణ), భూమి(గుంటూరు), హేమ(ఈ.గోదావరి), లావణ్య(అనంతపురం), అక్షయ(కర్నూల్), దీక్షిత(చిత్తూరు), స్టాండ్‌బైగా నాగశరణ్య(కడప), జయప్రసన్న(చిత్తూరు), రమ్య(విజయనగరం), కీర్తి(శ్రీకాకుళం).



12 అడుగుల కొండ చిలువ

కేవీబీపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం మారప్పరెడ్డి కండ్రిగ చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి 12 అడుగుల కొండచిలువ కనిపించింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న భోగరాజు, రఘుపతి దానిని చాకచక్యంగా పట్టుకుని సమీపంలోని అటవీప్రాంతంలో వదలిపెట్టారు.

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఊరట

పెన్షన్లలో కమ్యుటేషన్ రికవరీల ఆపివేతపై ఉత్తర్వులు

పుత్తూరు,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులకు ఊరట లభించింది.కమ్యుటేషన్ల రికవరీ కాలం 11 సంవత్సరాల మూడు నెలలు పూర్తయితే పెన్షన్లలో నవంబరు నెల నుంచి రికవరీని ఆపివేయాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.గతంలో నిర్ణయించిన 15ఏళ్ల కాలంలో కమ్యుటేషన్ రికవరీలపై విశ్రాంత ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించి ఇంటీరియమ్ ఉత్తర్వులను పొందారు.1980లో బేసిక్ పెన్షన్‌లో 10.7 శాతానికి సమానంగా 40శాతం మొత్తాన్ని రిటైరయ్యే సమయంలో తీసుకుని 15 ఏళ్లలో ప్రభుత్వానికి చెల్లించేవారు. అయితే 2010లో 9వ పే కమిషన్ భారీగా జీతాలను పెంచడంతో బేసిక్ పెన్షన్‌లో 8.4 శాతానికి తగ్గించి ఆ మేరకు 40 శాతం మొత్తాన్ని విశ్రాంత ఉద్యోగులకు కమ్యుటేషన్ మొత్తాలను అందించారు. ఇదే సమయంలో రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లను 12 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. మరో పక్క 1980లో మనిషి సగటు జీవిత కాలం 57 ఏళ్లు కాగా 2010లో 72 ఏళ్లకు పెరిగింది. ప్రభుత్వ నిబంధనల మేరకు విశ్రాంత ఉద్యోగి 15 ఏళ్ల చెల్లింపు మధ్యలో చనిపోతే రికవరీ పూర్తిగా రద్దవుతుంది. సగటు వయస్సు పెరగడం వల్ల ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగి చెల్లింపులో 99 శాతం నష్టం జరిగే అవకాశం తగ్గిపోయింది. ఈ మూడు అంశాలను విశ్రాంత ఉద్యోగులు హైకోర్టు ముందుంచగలిగారు.ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి రికవరీని నిలిపివేయాలని ఆదేశాలను జారీ చేసింది. విద్యుత్ సంస్థ విశ్రాంత ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తమ రికవరీలను ఆపాలని కోరుతున్నారు.



పట్టుబడిన నాగుపాము

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ ఆఫీసర్స్ క్వార్టర్స్ వద్ద మంగళవారం ఓ నాగుపాము పట్టుబడింది. బీటైప్ క్వార్టర్స్‌లో టీటీడీలోని వివిధ విభాగాల అధికారులు నివసిస్తుంటారు. మంగళవారం ఉదయం సుమారు ఆరు అడుగుల నాగుపాము 23వ నెంబరు గల ఇంట్లోకి వెళ్లి.. కొద్ది సమయానికే వెలుపలకు వచ్చేసింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మహిళలు భయంతో బయటకు వచ్చి టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. పట్టుబడిన నాగుపాము మరో పిల్లపామును మింగేసినట్టు భాస్కర్‌నాయుడు తెలిపారు. ఆ పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.



ఇళ్లమధ్యలో ఇసుక డంప్

తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ గరుడాద్రినగర్‌లో కొందరు ఇళ్లమధ్యలో ఇసుకను డంప్‌చేసి అనధికారికంగా విక్రయిస్తున్నారు. రోడ్డు పక్కనే చుట్టూ ప్రహరీ ఉన్న ఖాళీ స్థలంలో ఇసుక గుట్ట ఉంది. ఇక్కడ రేయింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల రాకపోకలతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

పంటను తొక్కించేశారు



ఇది 20 రోజుల కిందట నాటిన వరి పంట. చెరువు ఆక్రమిత పొలమని మంగళవారం ట్రాక్టరుతో తొక్కించేశారు. దొరవారిసత్రం మండలం వెదురుపట్టు పంచాయతీ నర్సమాంబపుర అగ్రహారం చెరువు సర్వే నెంబరు 43, 44లో ఐదు దశాబ్దాలుగా కొందరు రైతులు 20 ఎకరాల వరకు ఆక్రమించి సాగు చేసుకొంటున్నారు. వీటిని తొలగించాలని తుంగమడుగుకు చెందిన అధికార పార్టీ నాయకుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ట్రాక్టర్‌తో రోటా వేటర్‌తో తొక్కించేశారు. పంట వేయకముందే కట్టడి చేయలేదు. కనీసం పంట దిగుబడి వచ్చేవరకైనా ఆగుంటే బాగుండేదని స్థానికులు అంటున్నారు.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

వ్యాను, బస్సు ఢీ : 15మందికి గాయాలు





చికిత్స పొందుతున్న ఆంజనేయులు నాయక్, నవీన్



బాలుడిని చికిత్సకు తరలిస్తున్న దృశ్యం



దెబ్బతిన్న వ్యాను

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 15మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం వేకువజామున తొట్టంబేడు మండలం జ్ఞానాంబ కండ్రిగ సమీపంలోని నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరానికి చెందిన శ్రీనునాయక్ వ్యాపారి. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు సోమవారం వ్యానులో బయలుదేరారు. జ్ఞానాంబ కండ్రిగ వద్ద బెంగళూరు నుంచి నాయుడుపేట వైపుగా వెళుతున్న టూరిస్టు బస్సు, వ్యాను ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యానులో ప్రయాణిస్తున్న శ్రీనునాయక్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, సోమ్లు, సైదా, సంజు, జాను, ఆంజనేయులు, దద్దు, జశ్వంత్, మంజుల, రూప, నీల, వెంకటేశ్వర్లు, నవీన్ తదితరులు గాయపడ్డారు. ఇందులో ఆంజనేయులు ఎడమకన్నుకు తీవ్రగాయమైంది. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులు తిరుపతి రుయాకు తరలివెళ్లారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అందరూ గాయాలతో బయటపడటంతో పెనుముప్పు తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

తిరుమల పవిత్రత పెంపొందేలా పనిచేయండి

- భానుప్రకాష్‌రెడ్డికి వెంకయ్య నాయుడి సూచన



తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రతిష్ఠ మరింతగా పెంపొందేలా పనిచేయాలని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. చెన్నై రాజ్‌భవన్‌లో మంగళవారం భానుప్రకాష్‌రెడ్డి ఆయన్ను కలిశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యి తదితర అంశాలను వెంకయ్య నాయుడు ఆరా తీసినట్లు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడుతూ మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

నాయుడుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - చెన్నై రహదారిపై మంగళవారం ఉదయం సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఓ లారీ మరమ్మతులకు గురవడంతో కావడంతో రహదారిపై ఆగి పోయింది. దీంతో రహదారికి రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. సమాచారం తెలుసుకున్న హైవే మొబైల్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. ఓ వైపు జోరున కురుస్తున్న వానలో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు.

విద్యుత్ తీగలు తెగిపడి ఆరు గేదెల మృతి

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తెగిపడి ఆరు గేదెలు మృతి చెందిన ఘటన కోట మండలం గూడలి ఉన్నత పాఠశాల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. గూడలి ఉన్నత పాఠశాల సమీపంలో ఆర్ అండ్‌బీ రోడ్డు ప్యాచ్ వర్కులు చేస్తున్నారు. ఈ పనుల కోసం వచ్చిన కంకర్ తీసుకువచ్చిన టిప్పర్ వెనుకభాగం విద్యుత్ లైన్‌కు తగలడంతో తీగలు తెగిపోయాయి. అదే సమయంలో గూడలి అరుంధతీయవాడకు చెందిన పారిచర్ల వెంకటనరసయ్య కుమార్తె మేతకోసం గేదెలను స్వర్ణముఖినదిలోకి తోలుకెళ్తుండగా వాటిమీద విద్యుత్ తీగలు పడ్డాయి. దీంతో ఆరు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. టిప్పర్ డ్రైవర్ బయటకు దూకేసి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. గేదెలను తోలుకెళ్తున్న బాలిక దూరంగా పరిగెత్తి ప్రాణాపాయం నుంచి బయటపడింది. స్థానికులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సుమారు రూ.4 లక్షల విలువచేసే గేదెలు చనిపోవడంతో రైతు వెంకట నరసయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

'ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం'

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ప్రాణాలర్పించేందుకు లక్షలాదిమంది మాలలు సిద్ధంగా ఉన్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి నాయకులు అన్నారు. కోట పట్టణంలో మంగళవారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కోట క్రాస్‌రోడ్డులోని నెహ్రూ విగ్రహం నుంచి బజారుసెంటర్‌లో ఉన్న గాంధీబొమ్మ సెంటర్, ఆర్టీసీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మీజూరు మాధవ్, డాక్టర్ రామకృష్ణారావు, దాసరి సుందరం, పాలా మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలలో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను తిప్పికొడుతామన్నారు. కార్యక్రమంలో వెంకట రమణయ్య, హేమంత్, వెంకటకృష్ణయ్య, శ్రీనివాసులు, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద కార్మిక సంఘ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు అల్లెయ్య మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు లక్ష్మయ్య, చంద్రశేఖర్, సుధాకర్, మునెయ్య, సాంబశివయ్య, పద్మనాభం, ఫయాజ్, జయకుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

భారత రాజ్యాంగం గొప్పది



కోర్టులో రాజ్యాంగ దినోత్సవాన్ని గురించి వివరిస్తున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు టౌన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాల్లో భారత రాజ్యాంగం గొప్పదని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు స్వేచ్ఛగా జీవించడానికి ఆనాడు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగ నిర్వహించారు. పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్రాంత జడ్జి దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

పుత్తూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పౌరులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, హక్కులను రాజ్యాంగం కల్పించిందని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వీరయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు రాజ్యాంగం కీలక పాత్ర

● మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్



రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు, సామాజిక, ఆర్థిక బేధాలు, వివక్ష లేకుండా సమైక్యతకు రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తుందని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యత సూత్రాలను పటిష్ఠం చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాజ్యాంగ పరిషత్ చేసిన కృషిని స్మరించుకున్నారు. పౌరులు తమ బాధ్యతలను రాజ్యాంగం అందించిన హక్కులను గుర్తుంచుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల స్వీకరణ

పుత్తూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి డివిజన్, ఏడీఈ కార్యాలయాల్లో ఈనెల 27న బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తామని పుత్తూరు ఏడీఈ శంకరయ్య తెలిపారు. వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలో మంగళవారం ఎస్ఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, రైతు సేవా సమితి అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు మోహన్‌రావు తన భార్య కడప సుబ్బమ్మ 10వ వర్ధంతి సందర్భంగా పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీవీఆర్ గ్రూప్ ఎండీ ప్రతాపరావు పవార్, పూలకృష్ణమూర్తి, సత్యనారాయణ రవికుమార్, మహబూబ్‌బాషా, సుధాకర్, బాబు, కూలీ రవి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

భూ ఆక్రమణ ఆపివేత

బాలాయపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడగుంట గ్రామం సర్వే నంబరు 268లో వివాదాస్పదంగా ఉన్న ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులుకు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది, పోలీసులు వెళ్లి ఆక్రమణలను అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, పోలీసులు పాల్గొన్నారు.

మోటర్ సైకిళ్ల చోరీ

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో మోటర్ సైకిళ్ల చోరీలు అధికమయ్యాయి. హోటళ్లు, దుకాణాలు, బ్యాంకులు, ఇళ్ల ముందు నిలిపిన బైక్‌లు మాయమైపోతున్నాయి. మూడు రోజుల క్రితం రైల్వేస్టేషన్ వద్ద పార్క్ చేసిన కోనేరు కిరణ్, జి.వెంకటేశ్వర్లుకు చెందిన రెండు బైకులు చోరీ అయ్యాయి. అలాగే హనుమాన్‌వీధిలో ఎస్ఎస్ డయాగ్నోస్టిక్ సెంటర్ పక్కన ఓ టిఫిన్ సెంటర్ వద్ద పార్క్ చేసిన శ్రీనివాస్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశారు.

సకాలంలో నిత్యావసర సరుకులు అందించాలి

చిట్టమూరు, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) చౌక దుకాణ డీలర్లు ఎండీయూల ద్వారా సకాలంలో నిత్యావసర సరుకులు అందించాలని తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. మంగళవారం చౌక దుకాణదారులు, ఎండీయూ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి నెలా ఒకటో తారీఖున సరుకులు పంపిణీ చేయాలని సూచించారు.




వైల్డ్ లైఫ్, సీలింగ్ భూముల్లో తవ్విన చెరువు - అంక్షలున్న ప్రాంతంలో నాటిన విద్యుత్ స్తంభాలు

వైల్డ్‌లైఫ్ ఏరియాలో చెరువు తవ్వకం

నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు

చిట్టమూరు, నవంబర్ 26 (ఆంధజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అధికారమే అండగా చెలరేగిపోయిన అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడ్డారు. పొరంబోకు, మేత భూములు, గ్రామ కంఠాలు, అటవీ భూములు... ఇలా కనిపించిన చోటల్లా వాలిపోయి చెరబట్టారు. ఇదేవిధంగా చిట్టమూరు మండలంలోని పక్షుల రక్షిత ప్రాంతాన్ని ఓ నేత వదల్లేదు. చిట్టమూరు మండలంలో తీరప్రాంత గ్రామమైన కుమ్మరిపాళెంలో 140 ఎకరాలను కోట మండలానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు కొనుగోలు చేశాడు. పక్కనే సర్వే నెంబర్ 2లో సెటిల్‌మెంట్ భూమితో పాటు ల్యాండ్ సీలింగ్ భూమి ఉంది. ఇదే ప్రాంతంలో సర్వే నెంబరు 1లో వందల ఎకరాల వైల్డ్ లైఫ్ ఏరియా ఉంది. వన్యప్రాణుల రక్షిత ప్రాంతంలో నింబంధనలకు తూట్లు పొడిచిన వైసీపీ నాయకుడు భారీ ఎక్స్‌వేటర్లు పెట్టి చెరువును తవ్వేశాడు. అప్పట్లో కుమ్మరిపాళెంవాసులు తిరుగుబాటు చేయడంతో ఆక్రమణదారుడు తనకున్న పలుకుబడితో అధికారుల సాయంతో గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేశాడు. అధికారులకు ఫిర్యాదు చేయగా వైల్డ్ లైఫ్ ఫారెస్టు రేంజర్ వచ్చి చెరువు కట్టను తొలగిస్తున్నట్లు హడావిడి చేసి వెళ్లిపోయారని గ్రామస్తులు ఆరోపించారు. అంతేకాకుండా వైల్డ్‌లైఫ్ ఏరియాలో నిబంధనలకు విరుద్ధంగా రెండు కిలో మీటర్లు విద్యుత్ స్తంభాలు నాటించాడు. సుమారు మూడు గ్రామాల ప్రజలు నడిచే రోడ్డుపై తట్టెడు మట్టి వేసినా పక్షుల రక్షిత ప్రాంతమంటూ అడ్డుకొనే అధికారులు అక్రమంగా చెరువు తవ్వడమే కాకుండా విద్యుత్ స్తంభాలు నాటినా పట్టించుకోకపోవడం పట్ల కుమ్మరిపాళెంవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోండి




గూడూరులో ప్రతిజ్ఞ చేస్తున్న న్యామూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది - నాయుడుపేటలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త

గూడూరు అర్బన్, నాయుడుపేట టౌన్, పెళ్లకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, ఓజిలి, చిట్టమూరు, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. మంగళవారం గూడూరు కోర్టు ఆవరణలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ విలువలను కాపాడతామని సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికీ ప్రాథమిక హక్కులను కల్పించడం జరిగిందన్నారు. వీటిపై ప్రజలు అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజేష్, సులోచనరాణి, లోకనాథం, శంకరయ్య, ఏవో పద్మావతి, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, అరవ పార్వతయ్య, మహబూబ్‌బాషా, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. ● నాయుడుపేటలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. లోకజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, మంచి ఆలోచనల కోసం మాత్రమే సెల్‌ఫోన్లను వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు సురేష్, సునీల్, సుధీర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ● పెళ్లకూరు మండల కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో ప్రమీలారాణి నివాళులర్పించారు. ● చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎంఈవో సనత్ కుమార్, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులచే రాజ్యాంగ పీఠిక చదివించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్, చంద్ర, చంద్రశేఖర్, వీవీ కుమార్, విద్యులత, ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ● కోట ఆర్టీసీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అన్‌బిన్ సువడగల్ సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్‌సాయి, భూపతి పోలయ్య, కర్లపూడి సుధాకర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● వాకాడు మండల కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో అన్నపూర్ణరావు నివాళులర్పించారు. ● సూళ్లూరుపేట వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్‌శర్మ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు ఉషారాణి, గౌరీ శంకర్, సునీత, శరత్ బాబు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ● ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయ సీనియర్ సహాయకురాలు ప్రసూన్న, ఏపీవో ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు. ● చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో మనోహర్ గౌడ్ నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగివుండాలి




రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగివుండాలని ఆర్టీవో బీఎస్‌కే కిషోర్ అన్నారు. మంగళవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ప్రభాకర్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ, ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, కోటేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న అయ్యప్పస్వామి జ్యోతి పూజ

నాయుడుపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో వచ్చే నెల 3వ తేదీన జ్యోతి పూజోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. జ్యోతి పూజోత్సవం సందర్భంగా గణపతిహోమం, పంచ వైద్యాలతో కర్పూరజ్యోతి, వీరనృత్యాలు, అమ్మవారి వేషధారణలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కామిరెడ్డి రాజారెడ్డి, కృష్ణారెడ్డి, సంజాయ్, మునిరాజ, అంకయ్య, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్ బాధితులకు సాయం



బాధితులకు బట్టలు అందిస్తున్న ఎంపీడీవో అన్నపూర్ణరావు

వాకాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపాళెం పంచాయతీ తీపలపూడి గ్రామానికి చెందిన బల్లి ప్రసాద్, కృష్ణమ్మ దంపతుల పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. మంగళవారం ఆ కుటుంబానికి ఎంపీడీవో అన్నపూర్ణరావు వంట సామగ్రి, బట్టలు, 10వ తరగతి చదువుతున్న వారి కుమారుడికి పాఠ్య పుస్తకాలు, ఏడాది కాలనికి బస్సు పాసు అందజేశారు.

వీధి లైట్లు ఏర్పాటు అమర్చండి

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలోని ముస్లిం వీధిలో గత కొద్దిరోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం 6గంటలు దాటితే వీధిదీపాలు లేక చీకట్లో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడాల్సివస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించు కోవడం, ఇప్పటికైన స్పందించి ముస్లిం వీధిలో లైట్లు అమర్చాలని కోరుతున్నారు.

చిరుజల్లులు

వెంకటగిరి టౌన్, ఓజిలి, దొరవారిసత్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడి అల్పపీడనం కారణంగా వెంకటగిరి పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి చిరు జల్లులు పడ్డాయి. పట్టణంలో వీధులను పొగ మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ● ఓజిలి మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి జల్లులతో కూడిన వర్షం పడుతూనే ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మబ్బులు కమ్మి చలుగాలులు వీస్తున్నాయి. మండలంలో మంగళవారం కురిసిన వర్షం ఎల్లి పైర్లకు మేలుచేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ● దొరవారిసత్రం మండల పరిధిలోని మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులు పడ్డాయి. ముసురు వాతావరణం నెలకొనడంతో పాటు చలిగాలులు వీచాయి.

రైతులకు, కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఎస్ఐసీ ఉద్యోగుల యూనియన్ నాయకుల నిరసన

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ రైతులకు, కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం గూడూరు బ్రాంచ్ అధ్యక్షుడు విజయ భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్ల క్రితం ఢిల్లీలో రైతులు ఉద్యమం చేపట్టిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ పలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు హామీలను అమలు చేయలేదన్నారు. రైతులకు రుణమాఫీ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, మెహబూబ్‌బాషా, శేఖర్‌రెడ్డి, శివకుమార్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించండి

వెంకటగిరి టౌన్, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సోమసానిగుంట, టీబీ పల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వరి సాగు చేసే రైతులు 23 రోజులు నారును ఎక్కువ పిలకలు పెట్టి దగ్గర దగ్గరగా నాటడం వల్ల మంచి దిగుబడి పొందవచ్చున్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయశ్రీ, కిషోర్, రామ్మోహన్ రావు, కృష్ణ, సుమ, మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగర్జున సాగర్

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుఫాన్ కారణంగా 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కిరణ్మయి సూచించారు. ఆర్డీవో కార్యాలయంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, అధికారులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. 27, 28 తేదీల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు.

ముందస్తు చర్యలపై దిశానిర్దేశం

పెళ్లకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి తెలిపారు. మంగళవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, సుధాకర్, స్వామి, తేజ, మోబీనా తదితరులు పాల్గొన్నారు.

పులికాట్‌లో ఒడ్డుకు చేరిన పడవలు

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచే ముసురు వేసుకొని చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. కారుమబ్బులు కమ్ముకొని చలుగాలులు వీయడంతో పులికాట్ సరస్సులో వేటకు వెళ్లిన మత్స్యకారులు పడవలు తీసుకొని ఒడ్డుకు చేరుతున్నారు. 27, 28 తేదీలో భారీ వర్షం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పులికాట్‌లో వేటకు వెళ్లరాదని అధికారులు చెప్పడంతో మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చి ఇళ్లకు చేరుకుంటున్నారు.

గూడూరు - తిరుమల సర్వీసుల ఏర్పాటుకు కృషి



గూడూరు - తిరుపతి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గూడూరు - తిరుమల మధ్య బస్సు సర్వీసుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో గూడూరు - తిరుపతి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గూడూరు నుంచి తిరుమలకు బస్సులు నడిచేవని, గత వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆ సర్వీసులను నిలిపివేయడం జగిందన్నారు. ఉత్తరాది ప్రాంతాల నుంచి వచ్చే ఎంతోమంది భక్తులు గూడూరు రైల్వేస్టేషన్‌లో దిగి తిరుమలకు బస్సుల్లో వెళ్లేవారన్నారు. భక్తుల సౌకర్యార్థ కోసం గూడూరు నుంచి తిరుమలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని రవాణ శాఖ మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే గూడూరు - తిరుమల బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో సిమెంటు బెంచీల ఏర్పాటు

గూడూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మంగళవారం రత్నాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, బాలయ్య, రాఘవులు సహకారంతో వాకర్స్ క్రీడాకారులు సౌకర్యం కోసం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు సిమెంటు బెంచీలను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలపాలని ఎమ్మెల్యే కోరినందుకు హర్షిస్తూ వాకర్స్ హెల్త్‌క్లబ్ సభ్యులు, పలువురు క్రీడారులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేడియంలో ప్రత్యేక గ్యాలరీ, ప్రహరీ మరమ్మతులకు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్ర ప్రసాద్, వసంత్‌కుమార్, శర్మ, వెంకటేశ్వర్లు, రత్నాకర్‌రెడ్డి, బొద్దు కృష్ణయ్య, సురేష్, విజయ్, కోటేశ్వరరావు, పురుషోత్తం, మస్తన్, మునీష్ సందీప్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీల్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు



బస్సు వద్ద చంద్రశేఖరపురం గ్రామస్తులు, విద్యార్థులు

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీ చంద్రశేఖరపురంలోని విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు గ్రామస్తులు, విద్యార్థులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన 50మందికి పైగా విద్యార్థులు చిట్టమూరు మండలం మెట్టు ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. వీరంతా చంద్రశేఖరపురం నుంచి విద్యానగర్‌కు చేరుకొని, అక్కడ నుంచి ఆటోలు, బస్సుల్లో మెట్టుకు వెళ్లాల్సి వస్తోంది. మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ సమస్యలను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు వివరించారు. ఎమ్మెల్యే స్పందించి వాకాడు డిపో మేనేజరుతో మాట్లాడి చంద్రశేఖరపురం విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం బస్సు సర్వీస్ నడిపేలా చర్యలు తీసుకున్నారు. ఇన్నాళ్లకు తమ కష్టాలు తీరాయంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో మంగళవారం బస్సుకు పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నదీ హారతులు వీక్షించేలా ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదీ హారతుల ఉత్సవంపై ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 30న కార్తీక మాసం ముగింపు సందర్భంగా నదీ హారతులు వేడుకను నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఈవో బాపిరెడ్డి జలవనరుల శాఖ, అగ్నిమాపక, పురపాలకశాఖ అధికారులతో పరిపాలనభవనంలో ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయా శాఖల పరిధిలో విధివిధానాలపై చర్చించా రు. అనంతరం నదిలో ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులందరూ నదీహారతులు వీక్షించేలా ఆలయ ఇంజనీరింగ్‌శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవో లోకేష్‌రెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో బాపిరెడ్డి

ముక్కంటి ఆలయంలో ఆగమోక్తంగా ఆకాశ దీపం



శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరా లయంలో మంగళవారం ఆకాశదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన ముక్కంటీశుడి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేసిన ఆలయ అర్చకులు అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగుర వేశారు. భక్తులు ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి సతీమణి సుధ, ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



వృద్ధురాలికి పర్సును అందజేస్తున్న రిషికుమార్

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. తన ఆటోలోపోగొట్టుకున్న నగదును బాధితురాలికి అందజేశారు. శ్రీకాళహస్తి 1టౌన్ సిఐ గోపి వివరాల మేరకు మల్లికమ్మ అనే వృద్ధురాలు పట్టణంలోని మార్కెట్ వద్ద తొట్టంబేడు మండలానికి చెందిన రిషికుమార్ ఆటోలో ఎక్కింది. ఆమె లోబావి వద్ద దిగి వెళ్లిపోయింది. అయితే ఆటోలో తన పర్సును మరచిపోయింది. రిషికుమార్ గుర్తించి అందులో చూడగా ఓ మొబైల్ ఫోన్, రూ.2వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అతను 1వ పట్టణపోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు బాధితురాలు మల్లికమ్మను పిలిపించి ఆ పర్సును అందజేశారు. రిషికుమార్ నిజాయితీని వారు అభినందించారు.

చట్టం అందరికీ సమానం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చట్టం అందరికీ సమానంగా అందాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. జాతీయ చట్ట దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... యేటా నవంబరు 26న ఇండియా రాజ్యాంగం దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. దీనినే సంవిధాన్ దివస్ అని కూడా అంటారని తెలిపారు. ఇదే రోజు జాతీయ చట్ట దినోత్సవం కూడా జరుపుకుంటారన్నారు. ఇక వరకట్న చట్టాల గురించి వివరించారు. న్యాయమూర్తి బేబీ రాణి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల సామాజిక అభివృద్ధే లక్ష్యం



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): సామాజిక పరంగా అన్నివర్గాల వారు అభివృద్ధి చెందేలా, అందరికీ సమ న్యాయం అందేలా రాజ్యాంగ రచించిన అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ఆదిమూలం కొనియాడారు. మంగళవారం 26వ తేది రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బైపాస్ రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కుల, మత, లింగ, వర్ణ బేధాలు లేకుండా అన్ని వర్గాలకు మేలు చేకూర్చే విధంగా రాజ్యాంగం ఉందన్నారు. అలాగే జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో గుణశేఖర్, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాగులో పడి గుర్తుతెలియని మహిళ మృతి

రేణిగుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నాస్వామిపల్లి సమీపంలోని వాగులో పడి ఓ మహిళ మృతి చెందింది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి అనుకుని వాగు ఉంది. ఈ వాగులో గుర్తుతెలియని మహిళ మృతి చెంది ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు స మాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. మృతి చెంది మూడు రోజులై ఉంటుందని, వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎం పర్యటనపై కలెక్టర్ సమీక్ష



అధికారులతో సీఎం పర్యటనపై సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం సమీక్షించారు. తిరుపతి ఎయిర్‌పోర్టులోని వీఐపీ లాంజ్‌లో ఎస్పీ సుబ్బరాయుడు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. నారావారిపల్లెలో ఆయన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు ఈనెల 27న సీఎం వస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అందుకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్, విమానాశ్రయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

రేణిగుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మందుబాబులకు జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 12 మందికి ఒక్కొక్కరికి రూ.1100ల చొప్పున, మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందికి రూ.10వేలు చొప్పున రూ.80వేలు జరిమానా విధించినట్లు సీఐ శరత్‌చంద్ర చెప్పారు.

భారత రాజ్యాంగం సామాన్యుల రక్షణ గోడ





పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రతిజ్ఞ - రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాలవనం విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యాన్ని, అంబేడ్కర్ ఆశయాలను కరస్పాండెంట్ శ్రీధర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాలను నిర్వహించారు. స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్, గైడ్ కెప్టెన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగం అమలు చేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఏర్పేడు: భారత రాజ్యాంగం సామాన్యుల రక్షణ గోడ అని పాపానాయుడుపేట జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్.వెంకట సుబ్బమ్మ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో మంగళవారం అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అంబేడ్కర్ సారథ్యంలో రూపొందిన రాజ్యాంగం 75 సంవత్సరాలుగా భారతీయులకు తోడు నీడగా, సామాన్యుల రక్షణ గోడగా నిలిచిందన్నారు. అనంతరం రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు నారాయణబాబు విద్యార్థులతో రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. బండారుపల్లి అమృత్ సరోవర్ వద్ద ఉపాధి కూలీలతో కలిసి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు భారత రాజ్యాంగాన్ని పంపిణీ చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో భారత రాజ్యంగ దినోత్సవం ఘనంగా జరిగింది.

కంటి వైద్య శిబిరానికి స్పందన

కేవీబీపురం నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానికులు పెద్దసంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సల కోసం 110మందిని ఎంపిక చేసినట్టు శిబిర నిర్వాహకులు తెలిపారు.

రామ్మూర్తినాయుడికి నివాళులు

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడికి మంగళవారం శ్రీకాళహస్తిలోని ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జుననాయుడు నివాళులర్పించారు. నారావారిపల్లెకు చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 46 సంవత్సరాలుగా వారి కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం సోదరి కనుమూరి హైమావతి, రామచంద్ర చౌదరి, శాప్ చైర్మన్ రవినాయుడు, యోగం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు శ్రీకాళహస్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు మంగళవారం ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రికి స్వాగతం



సత్యప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న కోట వినుత, చంద్రబాబు తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత స్వాగతం పలికారు. తిరుపతి విమానాశ్రయానికి మంగళవారం ఆయన చేరుకోగా ఆయనకు ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోట చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకుడు



వరదయ్యపాళెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విజయవాడలోని ఆయన కార్యాలయంలో వరదయ్యపాళెం మండలం వెంకటరెడ్డికండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు మల్లికార్జుననాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

పాలమంగళంలో ఇసుక డంప్ స్వాధీనం



ఇసుక డంప్ వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు

నారాయణవనం, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళం సౌత్‌లో అక్రమంగా నిల్వ ఉంచి ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. పాలమంగళం దక్షిణం హరిజనవాడ సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను డంపు చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఎస్పీ రవికుమార్, రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో ఇసుక డంప్ చేసిన ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్ జయరాములు ఆధ్వర్యంలో ఇసుక డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టి

మండలంలో మహిళలపై దాడులు, గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ రవికుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన నారాయణవనం పోలీసు స్టేషన్‌ను రికార్డులను తనిఖీ చేశారు. జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్ఐకు సూచనలు ఇచ్చారు. రూరల్ సీఐ రవీంద్ర, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

సత్యవేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని వీఆర్‌కండ్రిగ వద్ద మంగళవారం రెవెన్యూ సిబ్బంది ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆపి రికార్డులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో సరైన అనుమతులు, రికార్డులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన ఒక్కో ట్రాక్టర్‌కు రూ.ఐదువేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పేదల దుకాణాలను కూల్చడం దారుణం: వైసీపీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 26: మండలంలోని పచ్చాలమ్మ కాలనీ కేటీ రోడ్డు పక్కన వేసుకున్న దుకాణాలను ఆక్రమణల పేరుతో కూల్చి వేయడం దారుణమని సత్య వేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త రాజేష్ మండిపడ్డారు. చాల సంవత్సరాలుగా ఇక్కడ నివసించే పేదలు రేకులు వేసుకుని చిన్న వ్యాపారాలు చేసుకుంటుంటే అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం దారుణమన్నారు. రాకేష్, గోపాల్‌రెడ్డి, గురువయ్య, మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వరదయ్యపాళెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ పరిధిలోని కారిపాకంలో మంగళవారం స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షలు నిర్వహించారు. పింక్‌బస్సులో నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయకుమార్, స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ వైద్యాధికారులు హరిత, పద్మావతి ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. సర్పంచు ఆనంద్, పంచాయతీ కార్యదర్శి శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా 28న సీఎల్ఎన్‌పల్లి, ఇందిరానగర్, 29న మరదవాడ, సంతవేలూరు, డిసెంబరు 2న వరదయ్యపాళెం-2, కడూరులో కూడా ఈ ఉచిత శిబిరం జరగనుంది.

నేడు విద్యుత్ ఫిర్యాదుల స్వీకరణ

వరదయ్యపాళెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వరదయ్యపాళెం ఏఈ విజయ వెంకటేశ్వర్లు తెలిపారు. నాగలాపురం సబ్ డివిజన్ కార్యాలయం, పుత్తూరు డివిజన్ కార్యాలయంలో కూడా ఇందు కోసం ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో అందజేయాలని ఆయన కోరారు.

ఏర్పేడు విద్యుత్‌శాఖ కార్యాలయం తనిఖీ

ఏర్పేడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని మంగళవారం విద్యుత్‌శాఖ చీఫ్ జనరల్ మేనేజరు (రెవెన్యూ) ధర్మజ్ఞాని తనిఖీ చేపట్టారు. ఆయన 2000 డీసీ లిస్టుసర్వీసులను కూడా తనిఖీ చేశారు. వ్యవసాయ, గృహ సర్వీసు కనెక్షన్లపై ఆరా తీశారు. పెండింగ్ బిల్లులు, పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. బకాయిలను వసూలు చేయాలని సూచించారు. సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఏఈ వాసుదేవయ్య పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ తీరుపట్ల విద్యార్థుల నిరసన



సత్యవేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపల్ తమపై అకారణంగా నిందలు మోపుతున్నారంటూ సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల ఆవరణలో బైఠాయించారు. ప్రిన్సిపాల్ సుజాత చెప్పుడు మాటలు విని తమను దూషిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా కాలేజీకి చెందిన కొంతమంది విద్యార్థుల ప్రవర్తనపై పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు లెటర్ పంపించారని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో వారికి వివరించే ప్రయత్నం చేశామన్నారు. అయితే తన ఉద్దేశాన్ని విద్యార్థులు అపార్థం చేసుకుని నిరసనలకు దిగినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

సంతాన సంపద వేంకటేశ్వరస్వామికి 108 రజత పుష్పాలతో అలంకరణ



ఏర్పేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న సంతాన సంపద వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారిని 108 రజత పుష్పాలతో అలంకరించి అష్టదళ పాద పద్మారాధన సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అంతకు ముందు ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

పరశురామేశ్వరుడి సేవలో మధ్యప్రదేశ్ డీజీ



ఏర్పేడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరుడిని మంగళవారం భోపాల్ టెలి కమ్యూనికేషన్ డీజీ ఆదర్శ్ కటియార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు ఆధ్వర్యంలో వేదపండితులు ఆయనకు స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు.

వేడుకగా ఏకాదశి



నారాయణవనం, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధి చెందిన పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయంలో మంగళవారం ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు సుప్రభాతసేవ, నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు. చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి